# ఫారిన్ కల్చర్

'ధీరేధీరే పానీ కాటే పత్తర్!" అని హిందీ సామెత. 'నీరు మెల్లమెల్లగా రాతిని కోస్తుందిట!

అలివేలు ఎన్నో ఏళ్లుగా భర్త వెంకటేశ్వర్లుని వత్తిడి చేస్తోంది. కాని అతను ఆమె వత్తిడికి ఏమాత్రం లొంగలేదు. కారణం ఆమె కోరిక సామాన్యమైందేంకాదు కనుక. అయినా అలివేలు నిరాశ చెందలేదు. వీలుచిక్కినప్పుడల్లా ఎన్నో విధాలుగా తన ప్రయత్నం కొనసాగిస్తూనే ఉంది. ఎప్పటికైనా తన కోరిక నెరవేరుతుందనే గట్టి నమ్మకముంది ఆమెకు.

అలివేలు చురుకైన వ్యక్తి. అనుకున్నది సాధించి తీరాలనే మొండి పట్టుదల ఆమెది. మంచికాని చెడుకాని ఇతరులు చెప్తే వినేరకం మనిషికాదు. ఆమె డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఫారిన్ వెళ్లాలనే కోరిక కలిగింది. ఆమె కోరిక కోరికగా వుండగానే ఆమె డిగ్రీ తీసుకుంది. తండ్రి అనారోగ్యంవల్ల మరి పై చదువులు చదివే వీలు చిక్కలేదు.

పెళ్లి సంబంధాలు చూస్తున్నారని విని తనకు ఫారిన్‌లో జాబ్ చేస్తున్న వ్యక్తిగాని లేదా ఫారిన్ వెళ్లే ఛాన్స్‌వున్న జాబ్‌లో వున్న వ్యక్తిగాని భర్తగా రావాలని ముక్కోటి వేల్పులను వేడుకుంది. కాని ఆమె ప్రార్థనను ఏ వేలుపూవిని మన్నించలేదు. చివరకు వెంకటేశ్వర్లుతో ఆమె వివాహం నిరాడంబరంగా జరిగింది.

వెంకటేశ్వర్లు ఎమ్.ఎ పాసై ఓ ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిగా ఛాందసుడు. దైవచింతన గలవాడు. అతనికి అన్ని సదుపాయాలు వున్న మూడు గదుల డాబా ఇల్లుంది. ఇంటిచుట్టూ వున్న కాంపౌండులో రకరకాల పూలమొక్కలు , కూరగాయల మొక్కలు పెంచడం అతని హాబీ, సినిమాలు, షికార్లు, క్లబ్‌లు, పార్టీలు గిట్టవు. వెర్రివెర్రి ఫ్యాషన్స్ జోలికిపోడు.

"గంగిరెద్దులా ఏమాత్రం మార్పులేని ఈ రొటీన్ జాబ్ మానేసి చక్కగా ఫారిన్ వెళ్ళే ఛాన్స్ వుండే జాబేదైనా ట్రైచెయ్యమని భర్తకు ఎన్నో పర్యాయాలు సలహా ఇచ్చింది అలివేలు. భార్య

సలహా ఏమాత్రం పట్టించుకోలేదు వెంకటేశ్వర్లు.

"తను చేస్తున్న జాబ్ తక్కువైందేమీ కాదని పిచ్చిపిచ్చి ఆలోచనలేం పెట్టుకోవద్దని" భార్యను ఎన్నో పర్యాయాలు మందలించేడు వెంకటేశ్వర్లు.

భార్యకు పట్టిన ఈ ఫారిన్ పిచ్చిని ఎలా పోగొట్టాలో అర్థం కాలేదు వెంకటేశ్వర్లుకి. అక్కడికీ తమ కంపెనీవారు కలిగించిన ఎల్.టి.సి. ద్వారా ప్రతి సంవత్సరం ఆమెను దేశంలో వున్న పుణ్యక్షేత్రాలూ, సుందర పర్యాటక ప్రదేశాలు తిప్పి చూపించేడు. కాని అలివేలు ధోరణిలో ఏమాత్రం మార్పురాలేదు. పైగా 'ఎల్.టి.సి. డబ్బులూ, బోనస్ ఇలా గుళ్లూ గోపురాలు చూడ్డానికి తగలెయ్యకపోతే వాటిని దాచుకుని కూడపెట్టిన డబ్బుతో ఫారిన్ తిరిగి 'రావచ్చుకదా!" అని భర్తను సాధించేది.

భార్య ప్రవర్తనకు విసుగుచెంది అటు తరువాత ఎల్.టి.సి. వాడుకోవడం మానుకున్నాడు వెంకటేశ్వర్లు.

వారి ఏకైక కుమార్తె పద్మావతి. కూతుర్ని అన్ని విధాల తన చెప్పుచేతల్లో వుంచుకుని తన కోరికలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని నిశ్చయించుకుంది. కంప్యూటర్‌లో జాయిన్‌చేసి అందులో డిప్లమా చదివించింది.

పెద్దవాళ్లతో పరిచయం కలుగుతుందని లేడిస్ క్లబ్‌లో మెంబర్‌గా చేరి వాళ్ల కార్యక్రమాలన్నింటిలోను చురుకుగా పాల్గొంటోంది అలివేలు. కూతురు పెళ్లివిషయంలో తనే చొరవ తీసుకుని లేడీస్ క్లబ్ మెంబర్స్ ద్వారా ఫారిన్‌లో జాబ్ చేస్తున్న పెళ్లికొడుకుల వివరాలు సేకరించింది.

క్లబ్ ప్రెసిడెంట్ రాజేశ్వరిగారి చెల్లెలి కొడుకు శ్రీనివాస్ అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడని, గ్రీన్‌కార్డు హోల్డర్‌అని, పెళ్లి చేసుకోవాలని వచ్చేడని తెలుసుకుని భర్తను వెంటతీసుకువెళ్లి మాట్లాడింది అలివేలు. కుర్రాడిది చక్కటి పెర్సనాల్టీ. మంచి జాబ్, వారు అడిగినంత కట్నం ఇవ్వడానికి ఒప్పుకొని పెళ్లి నిశ్చయించింది.

'ఉన్న ఒక్క కూతుర్ని ఫారిన్‌లో జాబ్ చేస్తున్న వాడికి కట్టబెట్టి ఫారిన్ పంపడమేంటి? అంతకంటే మంచి జాబ్ చేస్తున్న వాళ్లు ఇండియాలో లేరా? కూతురు అల్లుడు కళ్ళముందు వుండొద్దా? అని అటు భర్త ఇటు బంధువులు అలివేలుని నిలదీశారు.

అలివేలు తన నిర్ణయం మార్చుకోలేదు.

"చంద్రమండలానికి వెళ్లివస్తున్న ఈ రోజుల్లో ఇంకా దగ్గరా దూరమేంటి" అని అందర్నీ సమాధానపర్చింది.

శ్రీనివాస్ గురించి వివరాలు సేకరించి 'అబ్బాయి బాగా డ్రింక్ చేస్తాడట!' అని భార్యకు చెప్పబోయాడు వెంకటేశ్వర్లు.

"ఆ విషయం నాకు ముందే తెలుసు! డ్రింక్ చెయ్యడం ఈ రోజుల్లో నేరమేం కాదండీ! అది కల్చర్ సొసైటీలో పెద్దవాళ్లతో మసలుకోవాలి. వాళ్ళిచ్చే పార్టీలకు వెళ్ళాలి. అందరూ మీలాగ చలివిడి ముద్దలా వుంటారేంటి?" అంటూ భర్తమీద విరుచుకుపడింది అలివేలు.

శ్రీనివాస్ పెర్సనాల్టీ, జాబ్ తనకుకూడా నచ్చినందువల్ల అతడిని పెళ్లిచేసుకోవడానికేం అభ్యంతరం పెట్టలేదు పద్మావతి.

అలివేలు కూతురు పెళ్లి ఘనంగా జరిపించి వారిని సంతోషంగా అమెరికా పంపించింది.

ఎంతటి కఠిన హృదయం కలవారికైనా పెళ్లిలో అప్పగింతలప్పుడు కూతుర్ని అత్తవారింటికి పంపుతున్నప్పుడు వారి కన్నులు చెమ్మగిల్లక మానవు. అలివేలు విషయంలో అటువంటిది లేకపోగా ఆమె ఎంతో సంతోషంగా వుండడంచూసి అందరూ ఆశ్చర్యపోయారు.

'ఆమెది కన్నతల్లి హృదయం కాదు కఠిన శిల' అన్నారు.

అమెరికాలో పద్మావతికి భర్త పనిచేస్తున్న కంపెనీలోనే జాబ్ వచ్చింది. విషయం తెలుసుకున్న అలివేలు ఎంతో ఆనందించి తన స్నేహితులకు చెప్పింది. కూతురు, అల్లుడు యోగ క్షేమాలను తరచూ ఫోన్ ద్వారా తెలుసుకుంటోంది.

'డెలివరీకోసం నేను అక్కడకు రాను. మెడికల్ ఫెసిలిటీస్ ఇక్కడ బాగున్నాయని' పద్మావతి తల్లికి చెప్పింది ఫోన్‌లో. సహాయంకోసం తనే అమెరికా వెళ్ళాలనుకుంది అలివేలు. కాని ఆమెకు ఆ సమయంలో కాలుకి ఫ్రాక్చర్ అవడం వల్ల వెళ్ళలేకపోయినందుకు ఎంతో విచారించింది.

పద్మావతికి ఏ ప్రాబ్లంలేకుండా డెలివరీ అయి మొగబిడ్డ పుట్టేడని వాడికి రాజేష్ అని పేరు పెట్టేరని తెలుసుకుని ఆనందించింది. మనవడి ఫొటో చూసి 'కుర్రాడిది అచ్చం తల్లి పోలికే!' అనుకుంది.

గత ఎనిమిది సంవత్సరాలుగా రాజేష్ బర్త్‌డే ఫోటోలు తల్లికి పంపిస్తోంది పద్మావతి. అలివేలుకి మనవడ్ని చూడాలనే కోరిక కలిగింది. వాళ్ళను రమ్మనమని ఎన్నో పర్యాయాలు ఫోనుచేసింది. వాళ్లు తీరిక లేదంటూ దాటేస్తున్నారు.

వెంకటేశ్వర్లు రిటైర్ అయ్యారని తెలుసుకుని "మీరిద్దరూ వచ్చి ఇక్కడే వుండకూడదూ? మీరు అక్కడ మేం ఇక్కడ, ఎందుకు? అందరం ఇక్కడే వుందాం మీరు వచ్చేయండి" అని కూతురు అల్లుడు ఇన్వైట్ చేశారు.

వారి ఇన్విటేషన్ కొండంత బలాన్నిచ్చింది అలివేలుకి. దాంతో భర్తను ముప్పొద్దులా వేధించి చివరకు అతని నోట సరే అనిపించింది.

అలివేలుకి తన కోరిక ఇన్నాళ్లకు ఫలించబోతున్నందుకు ఎంతో సంతోషంగా వుంది. వెంటనే ప్రయాణ సన్నాహాలు మొదలుపెట్టింది. ముందుగా ఇల్లు, ఫర్నీచర్, సామాన్లు అమ్మివేయడానికి అన్ని దిన పత్రికల్లో ప్రకటనలిచ్చింది. ఫ్రెండ్స్‌కి, క్లబ్ మెంబర్స్‌కి చెప్పింది.

వెంకటేశ్వర్లు అన్న కుమారుడు నందకిషోర్ విజయనగరంలో బిజినెస్ చేస్తున్నాడు. అతను ప్రకటనచూసి బయల్దేరి వచ్చేడు. 'అదేమిటి బాబాయి! ఇల్లు, ఫర్నీచర్ అమ్మివేస్తామని ప్రకటన ఇచ్చారేంటి? అన్నాడు.

'మరేం లేదు నందూ! మేం అమ్మాయి దగ్గరకు అమెరికా వెళ్లిపోతున్నాం. వీటి అవసరం మరి మాకు లేదు అందుకని" అంది అలివేలు.

నందకిషోర్ ఆ ఇల్లు సామాన్లు నాలుగు లక్షలకు కొన్నాడు. తన ఇల్లు పైవారి చేతుల్లోకి పోనందుకు ఆనందించేడు వెంకటేశ్వర్లు. ఇల్లు సామాన్లు తొందరగా అమ్ముడుపోయి విముక్తి కలిగినందుకు ఎంతో ఆనందించింది అలివేలు. తాము అమెరికా వెళ్లిపోతున్నట్లు బంధువులకు స్నేహితులకు చెప్పి వారందరి వీడ్కోలు పొంది విమాన మెక్కేరు అలివేలు, వెంకటేశ్వర్లు. వారినెంతో సాదరంగా రిసీవ్ చేసుకున్నారు అమెరికాలో కూతురు, అల్లుడు, మనవడు.

మూడు రోజులు శెలవుపెట్టి వారిని చుట్టుపక్కలనున్న ముఖ్యమైన ప్రదేశాలన్ని చూపించేరు. అలివేలు ఒక్క క్షణమైనా రాజేష్‌ను వదలక తనవద్దే వుంచుకుని వాడికి బ్రష్ చెయ్యడం, నీళ్లు పోయడం, డ్రస్ వెయ్యడంవంటి పనులు చెయ్యాలని ఎంతో ముచ్చట పడింది. కాని రాజేష్ ఆవిడకు ఆ అవకాశం ఇవ్వక తన పనులుతానే చేసుకోవడంతో ఎంతో ఆశ్చర్యపోయింది. నిరాశ చెందింది. నాలుగో రోజు ఉదయాన్నే బోర్డింగ్ స్కూలు వ్యాను వచ్చి రాజేష్‌ని ఎక్కించుకుని పోయింది.

"అదేమిటే కుర్రనాగన్నకి ఎనిమిదేళ్ళైయినా నిండలేదు! అప్పుడే వాడిని బోర్డింగ్ స్కూల్లో పడేశారా? వాడు మిమ్మల్ని విడిచివుండగలడా?" అంది అలివేలు.

"వాడికి అలవాటేనమ్మా! గత నాలుగేళ్లనుంచి అక్కడే వుంటున్నాడు. అక్కడ వారికి మంచి డిసిప్లేన్ నేర్పిస్తారు. టైమ్ ప్రకారం అన్నీ చూస్తారు. చక్కగా చదివిస్తారు. మరి మేమిద్దరం ఉదయం 8 గంటలకు వెళ్తే రాత్రి 8 గంటలకు వస్తాం. వాడి ఆలనా పాలనా ఎవరు చూస్తారు. వీక్ఎండ్ వచ్చి ఒకరోజు మాతో వుంటాడు. ఇక్కడందరూ అంతే" అంది.

"మేము వచ్చేంకదా! ఇకవాడి సంరక్షణ మేము చూసుకుంటాం. వాడిని ఇంటిపట్టున

వుండనీ. మీ నాన్నగారు వాడిని కూర్చోబెట్టి చక్కగా చదివిపస్తారు. రోజు స్కూలుకి తీసుకునివెళ్లి తీసుకొస్తారు. వాడికి కావాల్సినవన్నీ నేను చేసి పెడతాను" అంది అలివేలు ఉత్సాహంగా.

"కుదర్దమ్మా! వాడి స్కూలు దగ్గరేం కాదు. వంద కిలోమీటర్ల దూరంలో వేరే రూట్‌లో వుంది. అంతదూరం వాడు రోజూ వెళ్లిరాలేడు" అంది.

కూతురు మాటలకు చాలా నిరుత్సాహ పడింది అలివేలు.

మర్నాడు సాయంత్రం పద్మావతి, శ్రీనివాస్ ఎంతో ఆనందంతో ఇంటికి వచ్చారు.

"అమ్మా నీకో గుడ్‌న్యూస్! మీ అల్లుడుగారు తన గుడ్ ఆఫీసెస్ ఉపయోగించి మీకు 'ఓల్డ్ పెర్సన్స్ కేర్ హోం'లో సీట్లు సంపాదించేరు. నెలకు ఈచ్ 500 డాలర్స్ అంటే ఇద్దరికీ నెలకు 1000 డాలర్స్ మాత్రమే నామినల్‌గా చార్జి చేస్తారు. ఎడ్వాన్స్ 3000 డాలర్స్ కట్టి డబుల్ రూమ్ బుక్ చేశారు. అక్కడ మీకు అన్ని సదుపాయాలు వుంటాయి. మీకు మీల్స్, మెడికల్ కేర్, అన్నీ వాళ్ళే చూసుకుంటారు. రూమ్‌లో టీవీ వుంటుంది. లైబ్రరీ కూడా వుందిట. కావాల్సిన బుక్స్ తెచ్చుకుని చదువుకోవచ్చు. అందులో మన ఇండియన్స్‌కూడా వున్నారట. నెలకోరోజు వచ్చి మీరు మాతో స్పెండ్ చెయ్యొచ్చుట. అంతేకాదు మాకు చాలా దగ్గర్లో అంటే 300 కిలోమీటర్ల దూరంలోనే వుంది" అంది ఎంతో సంతోషంతో.

"ఏమిటే నీ అఘాయిత్యం. మిడిసిపాటూను! నాకర్థం కావడం లేదు! పేగు తెంచుకుపుట్టిన పసివాడిని బోర్డింగ్ స్కూల్లో చేర్పించేవు! కన్నవాళ్లను రప్పించి వాళ్లు గతిలేని అనాధలైనట్లు ఆశ్రమంలో చేర్పిస్తానంటున్నావ్! నీకు మమత, మమకారం, అనురాగం ఏ కోశాన్నయినాలేవా? నీది గుండేనా లేక రాతిబండా?" అంటూ కోపంతో రెచ్చిపోయింది అలివేలు.

"ఇదీ 'ఫారిన్ కల్చర్' అమ్మా! ఇక్కడ మమత, అనురాగాలకు తావుండదు. ఓల్డ్ పేరెంట్స్ దగ్గర పిల్లలుండరు. పిల్లలు తల్లిదండ్రుల్ని తమ దగ్గర వుండనివ్వరు. ఎవరి బతుకులు వాళ్ళవి. ముసలి వాళ్లకు ఇల్లూవాకిలీ వుంటే అందులో వుంటారు. లేకుంటే వాళ్లవాళ్ల తాహతులను బట్టి హోమ్సులో చేరిపోతారు. 'విహంగ న్యాయం' పక్షులు పిల్లకి రెక్కలొచ్చేవరకూ తమ గూళ్లలో వుండనిచ్చి అటు తరువాత బయటకు తరిమేస్తాయి. అంతే! కాదు? నువ్వు కోరుకున్నట్లు ఫారిన్‌లోనే వుంటావు కదా!" అని ఎంతో ధృఢంగా అన్న కూతురు మాటలకు నిర్ఘాంతపోయింది అలివేలు.

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 12-6-1998) ✪